# 'ఇదెక్కడి కొత్త సమస్య బాబూ!'

.. అంటూ తల బాదుకుంది కమల! కమల పేరులో ఎంత సింప్లిసిటీ వుందో మనిషిలోనూ అంతే వుంది! నెమ్మదైన మాటా, చల్లని మనసూ, మెత్తని స్వభావం.

జయరాం కమలకి తగ్గ మొగుడు! ఈమెలో వున్న లక్షణాలన్నీ అతనిలోనూ వున్నాయ్! అందుకే వీళ్ళని చూసిన వాళ్ళందరూ 'మేడ్ ఫర్ ఈచ్ అదర్' అంటారు.

జయరాం వాళ్ళది మధ్య తరగతి కుటుంబం. సెక్రటేరియట్ సెక్షన్ ఆఫీసరుగా పనిచేస్తున్నాడు. రెక్కాడితే డొక్కాడుతుంది. ఆస్తి పాస్తులేమీ లేవు. అయితే భార్యాభర్తలిరువురూ చదువుకున్నవారూ, సంస్కారవంతులూ కావడంచేత పిల్లలిద్దర్నీ చదివిస్తున్నారు కాలేజీల్లో. లతా, శుభా ఇద్దరూ బంజారా కాలేజీల్లో బియస్సి ఫస్టియర్ లోనూ, బి.కాం సెకండియర్ లోనూ వున్నారు.

ఆడపిల్లలైనా మొగపిల్లలతో సమానంగా చదువూ సంధ్యా వుండాలని నమ్మేవాళ్ళలో వాళ్ళొకరు. అందుకే వాళ్ళని పల్లెత్తుమాటనకుండా వాళ్ల ఇష్టా ఇష్టాలకి ఎదురు చెప్పకుండా అపురూపంగా పెంచారు కమలా జయరాంలు.

పెద్దమ్మాయి లత బాగా పాడుతుంది, మంచి కంఠం. అందుకని సంగీతం, నేర్పిస్తు వొచ్చారు. శుభకి సంగీతమంటే అంతమోజు లేదు. ఎవరైనా బాగా పాడ్తూ వుంటే వింటుందంతే! కానీ శుభకి పెయింటింగ్ చెయ్యడమంటే ఎంతో ఇష్టం, నిర్మల్ పెయింటింగ్, ఆయిల్ పెయింటింగ్ ఏవేవో క్లాసుల కెళ్ళింది.

ఒకరోజు శుభ కడుపు నొప్పిగా వుందని కాలేజీకి వెళ్ళకుండా ఇంట్లోనే వుండిపోయింది. "ఈ మధ్య అన్నం కూడా సరిగ్గా తినడంలేదు. మొహమంతా

పీక్కుపోయినట్టుంది. మనిషి రోజురోజుకీ చిక్కిపోతోంది. నవనవలాడుతూ వుండవలసిన ఈ వయస్సులో ఇలా ఎందుకుందో ఏమో? డాక్టరు దగ్గరికి తీసికెళ్ళి అన్ని పరీక్షలూ చేయించి రండీ" అంది భర్తతో కమల.

"సాయంత్రం ఆఫీసు నుంచి రాగానే తీసికెళ్తాను రెడీగా వుండండి" అన్నాడు జయరాం.

తయారవమంటే ఆసుపత్రికి రానని మొండికేసింది శుభ. వెళ్ళకుండా తప్పించుకోవడానికి "బాగేనే వున్నాను. నాకే బాధలేదు" అంది ఫ్రెండింటికి వెళ్ళాలని.

డాక్టర్ శుభని తదేకంగా చూశాడు. రక్తపరీక్ష, యూరిన్ పరీక్షా చేయించాడు. మర్నాడు మళ్ళీ రమ్మన్నాడు రిపోర్ట్స్ వొచ్చాక మాట్లాడదామని! కమలా జయరాంలు కంగారు పడ్డారు. "ఏమైంది డాక్టర్ మా శుభకి?" అడిగారు భయంగా!

"రేపు రిపోర్ట్స్ రానివ్వండి చెబుతాను. రేపు అమ్మాయిని కాలేజీకి పంపకండి. ఉదయం పది గంటలకి ఆసుపత్రికి తీసుకురండి" అన్నాడు.

డాక్టర్ వైద్య రిపోర్టులన్నీ చూశాడు. శుభకేసి చూశాడు. ఆమె కళ్ళలో భయం మొహంలో దైన్యం ఏదో నిస్సహాయత! ఏడవడం మొదలెట్టింది శుభ.

డాక్టర్ వైద్య ఒక నిమిషం ఆగి, "యువర్... డాటర్... ఈజ్... ఎ...డ్రగ్...ఎడిక్ట్!" అన్నాడు.

"నో!... నో!... యూ... ఆర్... రాంగ్... డాక్టర్!" అరిచాడు పిచ్చి వాడిలా జయరాం!

"ఇంపాజబుల్!" తలకొట్టుకుంది కమల, కళ్ళల్లో నీళ్లు తిరుగుతూంటే!

"నాకేం తెలీదు. నా ఫ్రెండు ఫాల్గుణి తెచ్చి ఒకరోజు సరదాగా వాడి చూడమంది. అంతే! అప్పటినుంచి ఇప్పటివరకూ ఆమే ఇస్తుంది నాకు.

మేమిద్దరం క్లాసెగ్గొట్టి కాలేజీ కాంపౌండులో దట్టంగా అల్లుకున్న చెట్ల సందున కూర్చుని దమ్ములాగుతాం!" ఏడ్చింది శుభ.

కమలకీ, జయరాంకీ మొహంలో నెత్తురు లేదు.

"ఫరవాలేదు లేవండి! అలవాటు పూర్తిగా ముదిరిపోయి ప్రాణం మీదకి రాకముందే మేల్కొన్నారు. నీ... కాన్ క్యూర్!... ఈ మత్తు మందులలో వున్న ప్రమాదమే ఇది. సరదాగా ఏమౌతుందో చూద్దాం అని మొదలుపెట్టినా బంకలా పట్టుకుని ప్రాణాలు తోడేసే దాకా పోదు! ఈ మధ్యన ఇది ఒక పెద్ద 'రాకెట్' లా తయారయింది. డబ్బుకోసం కొందరు పిల్లలకి ఈ అలవాట్లు చేస్తున్నారు. ఈ పసి వాళ్ళని ఈ మందులకి బానిసలని చేసి సంపాయిస్తున్నారు. ప్రతి తల్లీ తండ్రీ వాళ్ళ పిల్లల విషయంలో ఈ విషయం గురించి చాలా జాగ్రత్తగా వుండాలి. చెక్ చేస్తూ వుండాలి! అన్నాడు.

"ఆడపిల్ల అరిటాకులాంటిద"ని మొగపిల్లల జోలికి పోకుండా కాపాడుతూ వస్తాము కానీ ఈ విషయాన్ని ఊహించనైనా లేము. కనీసం మొగ పిల్లాడయితే సిగరెట్లు, బీడీలు కాల్చకుండా, డ్రింక్ చెయ్యకుండా చూడాలనే ధ్యాస వుంటుంది. ఆడపిల్ల గురించి అలా అనుకోము కదా" అంది కమల బాధగా.

"ఇదెక్కడి కొత్త సమస్య బాబూ!" అని ఏడుస్తూ తొందరగా ట్రీట్‌మెంట్ స్టార్ట్ చేసి మా బిడ్డని కాపాడండి డాక్టర్!" అంటూ కంటతడి పెట్టారు, డాక్టర్ కాళ్ళమీద పడి జయరాం, కమలా దంపతులు.

*